# సాక్షి ఖమ్మం

గురువారం । 7 । ఆగస్టు । 2025






**ఎవరికీ పట్టని సంక్షేమం**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ కరువవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 8లో



**నానో యూరియాతో లాభాలు**

గుళికల యూరియాకు బదులు నానో యూరియా వినియోగంతో రైతులకు లాభం ఉంటుందని డీఏఓ పుల్లయ్య తెలిపారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 35° / 25°

**వాతావరణం**

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత వాతావరణం చల్లబడే అవకాశముంది.

## ఆధ్యాత్మికం.. అనుబంధం

వరుస పండుగలతో జిల్లా కేంద్రంలో బుధవారం రద్దీ నెలకొంది. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మి వ్రతం జరుపుకోనున్నారు. అలాగే, మరుసటి రోజు శనివారం రాఖీపౌర్ణమి వచ్చింది. దీంతో వ్రతానికి కావాల్సిన పూలు, పండ్లు, గాజులు, దేవతామూర్తుల పటాలతో పాటు రాఖీల కొనుగోలులో మహిళలు నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం ఖమ్మం కమాన్‌బజార్ తదితర ప్రాంతాలు రద్దీగా మారాయి. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



వ్రతానికి పూలు కొనుగోలు చేస్తూ...



అమ్మవారి పటాలు పరిశీలిస్తున్న మహిళలు



రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

## న్యూస్‌రీల్

### పారిశ్రామిక పార్కులకు చేయూత ఇవ్వండి



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

మధిర: మధిర నియోజకవర్గంలో రెండు పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు చేయూత నివ్వాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కేంద్ర మంత్రి జితన్ రామ్ మాంజీకి వినతిపత్రం అందజేశారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రిని కలిసిన వారు మధిర మండలం ఎండపల్లి, ఎర్రుపాలెం మండలం రేమిడిచర్లల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఇవేకాక తెలంగాణలోని ప్రతీ నియోజకవర్గంలో ఒక పార్క్ ఏర్పాటుకు సహకరించాలని కోరగా, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ మల్లు రవి ఉన్నారు.

### 10న జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన

మధిర: మధిర మండలం వంగవీడు సమీపాన రూ.600 కోట్ల నిధులతో నిర్మించే జవహర్ ఎత్తిపోతల పథకానికి ఈనెల 10న శంకుస్థాపన జరగనుంది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ పథకానికి శంకుస్థాపన చేస్తారు.

### స్ఫూర్తిప్రదాత జయశంకర్



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఆచార్య కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కొనియాడారు. జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడగా వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు ఏ.శ్రీనివాస్, కె.సత్యనారాయణ, శ్రీలత, ఎన్.మాధవి, శ్రీనివాసరావు, వేలాద్రి పాల్గొన్నారు.

### వైద్యుల నియామకానికి ఇంటర్వ్యూలు



అభ్యర్థి సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై 17మంది వైద్యులను నియమించనుండగా, దరఖాస్తుదారులకు బుధవారం డీసీహెచ్ఎస్ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించారు. డీసీహెచ్ఎస్ కె.రాజశేఖర్‌గౌడ్, డీఆర్వో పద్మశ్రీ, జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యాన 19మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించగా, గురువారం తుది జాబితా విడుదల చేస్తామని వారు తెలిపారు.

### ప్రవేశాలు, హాజరు పెరగాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఎర్రుపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలతో పాటే విద్యార్థుల హాజరు పెరిగేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడాక ప్రిన్సిపాల్ ఆర్.రవికుమార్, అధ్యాపకులతో సమావేశమై ప్రవేశాలు, హాజరు పెంపు, అభివృద్ధి పనుల్లో నాణ్యతపై సూచనలు చేశారు.

### జిల్లాకు 2,600 బ్యాలెట్ బాక్స్‌లు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు అవసరమైన 2,300బ్యాలెట్ బాక్స్‌లను ఇటీవల గుజరాత్ నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించింది. బుధవారం మహారాష్ట్ర నుంచి మరో 300బ్యాలెట్ బాక్స్‌లు కేటాయించగా, రెండు, మూడు రోజుల్లో జిల్లాకు చేరతాయని అధికారులు తెలిపారు.

# 82 డెంగీ హాట్‌స్పాట్లు..




సాక్షి ప్రతినిధి, ఖమ్మం: విషజ్వరాల్లో అత్యంత ప్రమాదంగా భావించే డెంగీ ఏటా జిల్లాపై పంజా విసురుతోంది. వైద్య సిబ్బంది మేల్కొనే లోపే పదుల సంఖ్యలో మొదలవుతున్న కేసుల సంఖ్య సీజన్ ముగిసే నాటికి వందలకు చేరుతోంది. ఈ ఏడాది జూలైలోనే అధికారికంగా 27 కేసులు నమోదుకావడం గమనార్హం. అలాగే, ఈ నెలలో 11 పాజిటివ్ కేసులు తేలాయి. డెంగీ బారిన పడుతున్న పలువురు సరైన వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాలతో వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు ముందస్తుగా అప్రమత్తమయ్యారు. గత నాలుగేళ్లలో నమోదైన కేసులను పరిగణనలోకి తీసుకొని జిల్లాలో 82 గ్రామాలను హాట్‌స్పాట్లుగా గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు.

- నాలుగేళ్ల కేసుల ఆధారంగా గుర్తింపు
- జిల్లాలో ఏటా 500కు పైగా కేసుల నమోదు
- ప్రభావిత గ్రామాల పీహెచ్‌సీలకు పరీక్ష కిట్లు
- కలెక్టర్ ఆదేశాలతో అప్రమత్తమైన వైద్య సిబ్బంది

**శాంపిళ్లతో నిర్ధారణ**

వర్షాకాలం సీజన్ ప్రారంభం కాగానే జిల్లా అంతటా దోమల మోత నిత్యకృత్యమైంది. దరిమిలా మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇందులో డెంగీ బారిన పడిన కొందరు మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యాన వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన జ్వర సర్వే నిర్వహిస్తూ అనుమానితుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నారు. డెంగీ హాట్‌స్పాట్లుగా గుర్తించిన గ్రామాల్లో ఎక్కువ శాంపిల్స్ తీస్తున్నారు. 2023లో 29,637 శాంపిళ్లు తీయగా 520 డెంగీ పాజిటివ్ కేసులు తేలాయి. 2024లో 32,656 శాంపిల్స్ తీస్తే 529, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 4,895 శాంపిళ్లు సేకరించగా 42 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కాగా, 2023లో అత్యధికంగా సెప్టెంబర్, అక్టోబర్‌లో 330, 2024 జూలై, ఆగస్టులో 277, ఈ ఏడాది గత నెల, ఈ నెల కలిపి 38 పాజిటివ్ కేసులొచ్చాయి.

**పారిశుద్ధ్య లోపంతోనే..**


చిన్నపాటి వర్షం కురవగానే జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో నీరు నిలిచి పారిశుద్ధ్య సమస్య ఏర్పడుతోంది. దీనికి తోడు పంచాయతీలకు పాలకవర్గాలు లేక, ప్రశ్నించే వారు లేక డ్రెయినేజీలను సరిగ్గా శుభ్రం చేయక దోమల మోత మోగుతోంది. మున్సిపాలిటీలు, ఇతర పట్టణాల్లో అదే పరిస్థితి ఉండగా వర్షాకాలం వచ్చిందంటే విష జ్వరాలతో ఇబ్బంది పడే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఫ్రై డే.. డ్రై డే కార్యక్రమాలు ప్రతీ వారం నిర్వహించాల్సి ఉన్నా కొన్ని ప్రాంతాల్లోనే జరుగుతోంది.

**ఆ గ్రామాల్లో తీవ్రత**

గత నాలుగేళ్ల డెంగీ కేసుల ఆధారంగా జిల్లాలో 82గ్రామాలను హాట్‌స్పాట్లుగా నమోదు చేశారు. ఏటా 500కు పైగా డెంగీ కేసులు నమోదవుతుండగా సగటున 200కు పైగా కేసులు ఈ గ్రామాల్లో వస్తున్నాయి. తిరుమలాయపాలెం మండలంలోని జల్లేపల్లి, పాతర్లపాడు, అజ్మీరాతండా, తిరుమలాయపాలెం, తిప్పారెడ్డిగూడెం, దమ్మాయిగూడెం, కొణిజర్ల మండలంలోని పెద్దమునగాల, పల్లిపాడు, గోపవరం, నేలకొండపల్లి మండలంలోని నేలకొండపల్లి, రాయగూడెం, బోదులబండ, గువ్వలగూడెం, ఖమ్మంరూరల్ మండలంలోని గుర్రాలపాడు, గుదిమళ్ల, రామన్నపేట, వైరా మండలంలోని వైరా, బోనకల్ మండలంలోని తూటికుంట్ల, ముదిగొండ మండలంలోని బాణాపురం, వల్లభి, రఘునాథపాలెం మండలంలోని వీవీ.పాలెం, రఘునాథపాలెం, ఖమ్మంఅర్బన్ మండలంలోని బాలపేట, వేంసూరు మండలంలోని కందుకూరు, సత్తుపల్లి మండలంలోని గంగారం, తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, కల్లూరు ఈ జాబితాలో ఉన్నాయి.

**హాట్‌స్పాట్లు గుర్తించిన గ్రామాల్లో నమోదైన డెంగీ కేసులు, కొన్ని పీహెచ్‌సీల వారీగా గ్రామాలు**

| సంవత్సరం | కేసులు | పీహెచ్‌సీ | హాట్‌స్పాట్ గ్రామాలు |
|---|---|---|---|
| 2021 | 195 | మంచుకొండ | 10 |
| 2022 | 369 | ఎం.వీ.పాలెం | 08 |
| 2023 | 162 | లంకాసాగర్ | 08 |
| 2024 | 175 | తిరుమలాయపాలెం | 06 |



**డెంగీ కిట్ల వివరాలు..**

| | |
|---|---|
| పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల్లో సరఫరా చేసిన కిట్లు | 54,011 |
| పీహెచ్‌సీల్లో నిల్వ ఉన్నవి | 24,011 |
| యూపీహెచ్‌సీల్లో స్టాక్ | 30,000 |
| బుధవారం నిర్వహించిన డెంగీ పరీక్షలు | 262 |
| ఎలీసా పరీక్షకు సేకరించిన రక్తనమూనాలు | 32 |

**డెంగీ నియంత్రణలోనే ఉంది..**

జిల్లాలో డెంగీ నియంత్రణలో ఉంది. కేసులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులను ఆదేశించాం. జ్వర లక్షణాలు ఉంటే పరీక్ష చేయించి తగ్గే వరకూ పర్యవేక్షించాలని సూచించాం. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో డెంగీ కిట్లు, మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఎక్కువ కేసులు నమోదైన ప్రాంతాలపై మరింత శ్రద్ధ వహిస్తున్నాం. ఎవరికైనా జ్వరం ఉంటే సమీప పీహెచ్‌సీలో పరీక్ష చేయించుకోవాలి.

– అనుదీప్ దురిశెట్టి, కలెక్టర్

### తల్లాడ వైద్యాధికారి సస్పెండ్

- డెంగీతో మహిళ మృతి ఘటనలో చర్యలు

తల్లాడ: తల్లాడ మండల వైద్యాధికారి ఐ.రత్నమనోహర్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గత నెల 24న తల్లాడకు చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి డెంగీతో మృతి చెందారు. ఈ విషయం సీఎంఓ దృష్టికి వెళ్లగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు విచారణకు ఆదేశించారు. ఈక్రమంలో పీహెచ్‌సీని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ.. వైద్యులు, సిబ్బందితో పాటు మృతురాలి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. ఈమేరకు డెంగీ నిర్ధారణ, చికిత్సలో వైద్యాధికారి నిర్లక్ష్యం ఉందని నివేదిక ఇవ్వడంతో రత్నమనోహర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో ఇన్‌చార్జి వైద్యాధికారిగా చెన్నూరు డాక్టర్ కె.ప్రత్యూషను నియమించారు.

## ఏటీసీ కోర్సులతో యువతకు ఉపాధి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ఏటీసీలో పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లలో ప్రవేశపెట్టిన కోర్సులతో యువతకు ఉపాధి భరోసా లభిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ మేరకు నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖమ్మం టేకులపల్లిలోని ఐటీఐని ఏటీసీగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యాన కలెక్టర్ బుధవారం పరిశీలించారు. వివిధ కోర్సుల బోధనకు సమకూర్చిన యంత్రాల వివరాలు తెలుసుకున్న ఆయన పదో తరగతి అర్హత ఉన్న ఎక్కువ మంది చేరేలా అవగాహన కల్పించాలని అధ్యాపకులకు సూచించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

■ ఖమ్మం స్పోర్ట్స్: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 45 పతకాలతో ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకున్నారు. ఇందులో అథ్లెటిక్స్ అకాడమీతో పాటు ఇతర క్రీడాకారులు ఉండగా కలెక్టర్ అనుదీప్ బుధవారం అభినందించి, అకాడమీ కోచ్ ఎం.డీ.గౌస్‌ను సన్మానించారు. డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్ పాల్గొన్నారు.

■ ఖమ్మంవ్యవసాయం: మూగజీవాల ఆరోగ్యంపై పశు వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. పశువులకు సకాలంలో వైద్యం అందిస్తూ, మందుల కొరత రాకుండా చూసుకోవాలని తెలిపారు. ఖమ్మం రాపర్తినగర్‌లోని జిల్లా పశు వైద్యశాలను తనిఖీ చేసిన కలెక్టర్ చికిత్సకు ఉన్న సౌకర్యాలు, మందుల లభ్యతపై ఆరాతీయడమే కాక అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా పశువైద్యశాల సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు, డాక్టర్ కె.కిశోర్ ఉన్నారు.

## విస్తరణ కాదు.. మరమ్మతులే!

- 'హ్యామ్'లో పనులపై మార్గదర్శకాలు
- 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టు సంస్థదే..

ఖమ్మం అర్బన్: జిల్లాలో ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు కొత్త విధానంలో జరగనున్నాయి. తాజాగా ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) విధానాన్ని ఆమోదించినా తొలుత చెప్పినట్లుగా కాకుండా మార్గదర్శకాల్లో మార్పులు చేశారు. ఈ విధానంలో సింగిల్ రోడ్లను రెండేసి లేన్లకు, డబుల్ రోడ్లను నాలుగు లేన్లుగా విస్తరిస్తారని మొదట ప్రకటించారు. కానీ విస్తరించకుండా ఇప్పటికే ఉన్న రహదారులకే మరమ్మతు చేస్తూ 15ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టు సంస్థలకు అప్పగించేలా ప్రణాళిక రూపొందించారు.

**జిల్లాలో 35రోడ్లు**

'హ్యామ్' విధానంలో జిల్లాలోని 35 రహదారులను ఎంపిక చేశారు. వీటి నిడివి 382 కి.మీ. మేర ఉండగా మరమ్మతులకు రూ.400 కోట్లతో ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ నిధులతో గుంతలు పడకుండా రహదారుల పునరుద్ధరణ, పటిష్ఠంగా డ్రెయినేజీల నిర్మాణం, దెబ్బతిన్న వంతెన స్థానంలో కొత్తవి నిర్మించడమే కాక అవసరమైన బ్రిడ్జిలకు మరమ్మతు చేస్తారు. ఇక సింగిల్ లేదా డబుల్ లేన్ల రహదారుల విస్తరణపై స్పష్టత లేకపోయినా... ప్రయాణానికి అంతరాయం లేకుండా మెరుగుపరుస్తామని మాత్రం అధికారిక వర్గాలు చెబుతున్నాయి. కానీ అసంపూర్తిగా నిలిచిపోయిన వీ.వీ.పాలెం – రఘునాథపాలెం(ఖమ్మం నియోజకవర్గం) మార్గంలో నాలుగు కి.మీ., రాయపట్నం – మోటమర్రి(మధిర నియోజకవర్గం) మార్గంలో సుమారు ఎనిమిది కి.మీ. రహదారిని మాత్రం డబుల్ లేన్‌గా నిర్మాణానికి నిర్ణయించినట్టు తెలిసింది.

**నాణ్యత.. నిర్వహణ**

కొత్త విధానంలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం 40 శాతం నిధులు చెల్లిస్తుంది. మిగతా 60 శాతం నిధులు నిర్మాణ సంస్థే భరిస్తే ప్రభుత్వం విడతల వారీగా చెల్లించనుంది. అంతేకాక సంస్థలే 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చూసుకోవాలి. తద్వారా ప్రభుత్వంపై ఒకేసారి భారం పడకపోగా, పనుల్లో నాణ్యత ఉంటుందని చెబుతున్నారు.

## మెరుగైన పనితీరుతో విద్యార్థులకు లబ్ధి



మాట్లాడుతున్న విజయలక్ష్మీబాయి (ఎడమ)

ఖమ్మం సహకారనగర్/కూసుమంచి: విద్యాశాఖ ఉద్యోగుల పనితీరు మెరుగ్గా ఉంటే విద్యార్థులకు బోధన, సౌకర్యాల్లో లోపాలు ఎదురుకావని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ(సైట్) డైరెక్టర్, జిల్లా పరిశీలకురాలు ఎస్.విజయలక్ష్మీబాయి తెలిపారు. జిల్లాలోని కూసుమంచి కేజీబీవీ, భవిత కేంద్రం, ఖమ్మంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లను బుధవారం ఆమె తనిఖీ చేశారు. అనంతరం రోటరీనగర్ హైస్కూల్‌లో డీఈఓ నాగపద్మజతో కలిసి విద్యాశాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల పెంపునకు ఇప్పటినుంచే ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని సూచించారు. ఈసమావేశంలో ఎంఈఓలు, హెచ్ఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు. కాగా, కూసుమంచి కేజీబీవీని సీఎంఓ రాజశేఖర్‌తో కలిసి తనిఖీ చేసిన విజయలక్ష్మి పరిసరాలు, వంటశాలలను పరిశీలించడమే కాక విద్యార్థులతో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. ఇన్‌చార్జి ఎస్ఓ రాజేశ్వరికి సూచనలు చేశారు.

# బొగ్గు లోడింగ్‌లో ఇష్టారాజ్యం

- టెండర్ పొడిగిస్తూ ఆర్‌సీహెచ్‌పీకి తరలింపు
- కోల్‌ఏజెంట్ల తీరుతో లారీల యజమానులకు నష్టం
- ఆందోళన చేసినప్పుడే లోడింగ్ పెంపు



లోడింగ్ లేక సత్తుపల్లిలో ఖాళీగా ఉన్న లారీలు

సత్తుపల్లి: సింగరేణి వ్యాప్తంగా సత్తుపల్లి మండలంలోని ఓసీల్లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి అవుతోంది. అయితే, దీంతో ఇక్కడి బొగ్గు కోసం వివిధ ప్రాంతాల పరిశ్రమల నుంచి ఆర్డర్లు వస్తుండగా.. రవాణాలో స్థానిక లారీల యజమానులకు మాత్రం చుక్కెదురవుతోంది. ఇదే సమయాన కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌సీహెచ్‌పీ)కు మాత్రం నిరంతరాయంగా రవాణా జరుగుతోంది. ఈక్రమాన తమకు అన్యాయం జరుగుతోందని లారీల యజమానులు మూడురోజులు అడ్డుకోవడంతో అధికార యంత్రాంగం మొత్తం కదిలొచ్చింది. కానీ న్యాయం చేయకపోగా ఆందోళనలు విరమించకపోతే ఉపేక్షించబోమని, కేసులు పెట్టేందుకైనా వెనుకాడమని హెచ్చరిస్తుండడం గమనార్హం. అయితే, తమను అధికారులు బెదిరించడం వెనుక బలమైన శక్తులు ఉన్నాయని లారీల యజమానులు వాపోతున్నారు.

**తాత్కాలిక టెండర్లతో...**

సత్తుపల్లి నుంచి కొత్తగూడెంలోని ఆర్‌సీహెచ్‌పీ టిప్పర్లలో బొగ్గు రవాణా చేస్తుండగా పర్యావరణ కాలుష్యం ఏర్పడుతోందని పలువురు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ)ను ఆశ్రయించారు. దీంతో రవాణాపై ఆంక్షలు విధించినా... సింగరేణి యాజమాన్యం తాత్కాలిక టెండర్ ఖరారు చేసి పొడిగిస్తోంది. రోజుకు 60 – 70 టిప్పర్లతో నాలుగు నుంచి ఐదు ట్రిప్పుల బొగ్గు రవాణా చేస్తుండగా.. స్థానిక లారీలకు లోడింగ్ దక్కక యజమానులు ఫైనాన్స్ కిస్తీ కట్టలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు.

**1,500 టన్నుల లోడింగ్**

ఇటీవల సత్తుపల్లి లారీల యజమానులు చేపట్టిన ఆందోళనతో సింగరేణి సీఎండీ బలరాంనాయక్ స్పందించారు. ఇందులో భాగంగా స్థానిక లారీలకు రోజుకు 1,500 టన్నుల బొగ్గు లోడింగ్ ఇవ్వాలని సూచించారని కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ నర్సింహారావు తెలిపారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి సైతం ఈ అంశంపై అధికారులతో చర్చించారని, అవసరమైతే మరింత లోడ్ పెంచేందుకు ప్రయత్నిస్తామని ఆయన వెల్లడించారు.

**కోల్ ఏజెంట్లదే పెత్తనం**

బొగ్గు లోడింగ్ ఇవ్వాలంటూ లారీల యజమానులు ఆందోళన చేయడం.. అప్పుడే అధికారులు ఎంతో కొంత లోడ్ పెంచడం ఆనవాయితీగా వస్తోంది. ఇదేసమయాన కోల్ ట్రాన్స్‌పోర్టర్ల నుంచి పర్మిట్లు తెచ్చుకున్న ఏజెంట్లు బొగ్గు లోడింగ్ బయట లారీలకే ఇస్తూ స్థానికులకు మొండిచేయి చూపుతున్నారు. అంతేకాక లోకల్ లారీలకు లోడింగ్ ఇవ్వాలంటే టన్నుకు రూ.100 నుంచి రూ.150, కిరాయిలో నాలుగు శాతం కమీషన్, రిసీఫ్ట్ మామూలు కింద రూ.400 వసూలుతో పాటు అన్‌లోడింగ్ లేని చోట టన్నుకు రూ.60 చొప్పున మినహాయిస్తే లారీకి రూ.3వేల నుంచి రూ.5వేల వరకు దండుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఇక పోతే బయట లారీల నుంచి రెండింతలు అదనంగా వసూళ్లు చేస్తున్నారని సమాచారం. ఇదేమిటని లారీల యజమానులు ఏజెంట్లను ప్రశ్నిస్తే లోడింగ్ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుండడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సత్తుపల్లిలో ఆరుగురు ఏజెంట్లు మొత్తం వ్యవహారాన్ని శాసిస్తున్నారని చెబుతున్నారు. మందమర్రి, తదితర ప్రాంతాల్లో లారీ యూనియన్ బాధ్యులే కోల్ ట్రాన్స్‌పోర్టర్లను సంప్రదించి లోడింగ్ ఇస్తుండగా.. ఇక్కడ అందుకు విరుద్ధమైన పరిస్థితి ఉండడం గమనార్హం.

## క్లుప్తంగా

### విద్యాశాఖ ఏఎంఓగా రాజశేఖర్


వాసిరెడ్డి రాజశేఖర్

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ)గా వాసిరెడ్డి రాజశేఖర్ నియమితులయ్యారు. ఆయన నియామకంపై డీఈఓ కె.నాగపద్మజ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చింతకాని మండలం తుమ్మలపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న రాజశేఖర్ ఏఎంఓగా గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

### హార్వెస్ట్, త్రివేణి జట్ల విజయం

ఖమ్మం స్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ మెమోరియాల్ రోలింగ్ క్రికెట్ ట్రోఫీ పోటీలు బుధవారం రెండో రోజుకు చేరాయి. అండర్–12 బాలుర విభాగంలో ఖమ్మంకు చెందిన హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్, త్రివేణి పాఠశాలల జట్లు ముందంజలో నిలిచాయి. తొలి మ్యాచ్‌లో త్రివేణి – శ్రీ చైతన్య టెక్నో స్కూల్ జట్లు పోటీ పడగా త్రివేణి, రెండో మ్యాచ్ హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ – షైన్ ఇండియా పాఠశాలల మధ్య జరగగా హార్వెస్ట్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా రిత్విక్, అభిషేక్ ఎంపిక కాగా, తొలుత మ్యాచ్‌లను తుమ్మల యుగంధర్, మార్కెట్ చైర్మన్ యర్లగడ్డ హన్మంతరావు ప్రారంభించారు. టోర్నీ నిర్వాహకుడు ఎం.డీ.మతిన్‌తో పాటు కొత్త సీతారాములు, బాణాల లక్ష్మణ్, మిక్కిలినేని నరేందర్, ఫరీద్ ఖాద్రీ, ఆశ్రిఫ్ పాల్గొన్నారు.

### వెబ్‌సైట్‌లో ఎంపిక జాబితా

ఖమ్మంవైద్యవిభాగం: జాతీయ ఆరోగ్య మిషన్ విభాగంలో తాత్కాలిక, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సపోర్ట్ ఇంజనీర్లను నియమించనున్నారు. ఇందుకు సంబంధించి ఎంపిక జాబితాను https://khammam. telangana. gov. in/ వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 7న ఉదయం 10–30 నుంచి సాయంత్రం 5గంటల్లోగా తగిన ధ్రువపత్రాలతో డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

### 'విద్యానిధి' దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంమయూరిసెంటర్: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన షెడ్యూల్ కులాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం దరఖాస్తుకు గడువు పొడిగించారు. ఈ విషయాన్ని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు కె.సత్యనారాయణ తెలిపారు. ఈ పథకం ద్వారా పది దేశాల్లో చదివేందుకు అవకాశం ఉండగా, అర్హత కలిగిన వారు రూ.20లక్షల ఆర్థిక సాయం కోసం ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నాక ప్రతులను తమ కార్యాలయంలో అందజేయాలని డీడీ తెలిపారు.

### నేటి నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు గురువారం ఖమ్మంలో ప్రారంభం కానున్నాయి. నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ పోటీలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం సిద్ధమైంది. ఉభయ రాష్ట్రాల్లో పేరున్న రంగస్థల నటులు 150మందికి పైగా పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి ఆదివారం వరకు పోటీలు జరగనుండగా, సమాజ చైతన్యం, మూఢ నమ్మకాల నిర్మూలన తదితర అంశాలపై నాటిక ప్రదర్శనలు ఉంటాయని నెలనెలా వెన్నెల బృందం బాధ్యులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్య కుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు వేముల సదానంద్ తెలిపారు.

### చదువు మానేసిన వారికి వరంలా ఓపెన్ స్కూల్

కారేపల్లి: వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారే కాక స్వయం సహాయక సంఘాల సభ్యులు ఓపెన్‌స్కూల్ ద్వారా చదువు కొనసాగించాలని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. కారేపల్లి ఐకే పీ కార్యాలయంలో బుధవారం ఆయన ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లుతో కలిసి ఐకేపీ సీసీలు, గ్రామ దీపికలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్న సభ్యులు పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశముందని తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశమున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐకేపీ సీసీలు అనిల్‌కుమార్, పుష్పకుమారి, సోందు, గౌసియా బేగం, విజయలక్ష్మి, అకౌంటెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 6,200 | 6,200 |
| కందులు | 5,850 | 5,000 |
| ఏసీ మిర్చి | 14,500 | 8,000 |
| మిర్చి | 8,600 | 7,400 |
| పత్తి | 7,850 | 6,800 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు



| | |
|---|---|
| టన్ను ధర | రూ.18,052 |

# ఎవరికీ పట్టని సంక్షేమం

- గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో వార్డెన్ల ఇష్టారాజ్యం
- అధికారుల తనిఖీలు కూడా నామమాత్రమే..
- ప్రత్యేక అధికారుల పరిశీలనలో వెలుగుచూసిన లోపాలు
- కల్లూరు ఘటనలో వార్డెన్ సస్పెన్షన్


కల్లూరు ఆశ్రమ పాఠశాలలో తలుపులు లేని బాత్‌రూమ్‌లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం ఆందోళన కలిగిస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడి సరైన భోజనం, సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండగా.. ఇటీవల కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురికావడం గమనార్హం. అయితే, కల్లూరు ఘటనకు వార్డెన్ విజయనిర్మల పర్యవేక్షణ లోపమే కారణమని గుర్తించిన ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. అలాగే, ఇన్‌చార్జ్ వార్డెన్‌గా హెచ్ఎం శ్రీనివాసరావును నియమించగా, ఏటీడీఓ భా రతిదేవి బుధవారం పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

**మధ్యాహ్నం చికెన్.. అదే సాయంత్రం?**

కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈనెల 3వ తేదీ ఆదివారం మధ్యాహ్నం విద్యార్థినులకు చికెన్ వండి పెట్టినట్లు తెలిసింది. అయితే ఇదే చికెన్‌ను కొందరు విద్యార్థులు సాయంత్రం కూడా తిన్నారని సమాచారం. వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో ఏ పూట వండింది ఆ పూటే వడ్డించాల్సి ఉండగా.. మధ్యాహ్నం వంటే సాయంత్రం కూడా వడ్డించడం, శుచి, శుభ్రత లేని కారణంగా ఫుడ్ పాయిజనింగ్ దారి తీసినట్లు తెలిసింది. అంతేకాక విద్యార్థినులు భోజనం చేసే సమయాన పర్యవేక్షించాల్సిన వార్డెన్ ఆ రోజు వసతిగృహంలో లేకుండా ఖమ్మంలో ఓ అధికారి రిటైర్‌మెంట్ వేడుకలకు హాజరైనట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా వార్డెన్లు ఆదివారం ఆ ఫంక్షన్‌లోనే గడిపారని తెలిసింది. ఫలితంగా విద్యార్థుల ఆహారం విషయంలో పర్యవేక్షణ లేక ఇబ్బంది పడినట్లు సమాచారం.

**జిల్లా కేంద్రంలోనే వార్డెన్లు**

ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల వార్డెన్లు చాలా మంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించడంలో విఫలమవుతుండగా, నాణ్యత లేని, అపరిశుభ్రమైన ఆహారం వడ్డించడం, తాగునీటి సరఫరా సరిగా లేకపోవడం, పరిశుభ్రత లేని మరుగుదొడ్లు వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ కారణాలతో విద్యార్థులు తరచుగా అనారోగ్యానికి గురవుతున్నారు. ఇటీవల గిరిజన శాఖలో అవసరం ఉన్నా, లేకున్నా ప్రొటోకాల్ పేరు చెప్పి వసతిగృహం విధులకు ఎగనామం పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ, మండల కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సిన వార్డెన్లు జిల్లా కేంద్రంలోనే కాలం వెళ్లదీస్తున్నారని సమాచారం.

**తూతూ మంత్రంగా తనిఖీలు**

విద్యార్థుల సంక్షేమం, ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు కూడా బాధ్యతలపై నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలున్నాయి. కేవలం మొక్కుబడిగా తనిఖీలుచేస్తూ, లోపాలు సరిదిద్దడానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని సమాచారం. ఇటీవల కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఎంఈఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ అధికారులు చేపట్టిన తనిఖీల్లో అనేక లోపాలు బయటపడడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. వంటశాలలు అపరిశుభ్రంగా ఉండడం, కూరగాయలు, సరుకుల్లో నాణ్యత లోపించడం తదితర లోపాలను గుర్తించినట్లు సమాచారం. అయితే, వార్డెన్లు మాత్రం తమ లోపాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రత్యేక అధికారుల పరిశీలనపై విమర్శలు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. కాగా, ప్రత్యేక అధికారులు గుర్తించిన లోపాలపై జిల్లా అధికారులు వార్డెన్లను వివరణ కోరినట్లు తెలిసింది.

### అన్నీ అరకొర వసతులే...

కల్లూరు: కల్లూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అరకొర వసతులతో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ మూడు నుంచి పదో తరగతి వరకు చదివే 93 మంది విద్యార్థినులు ఉండగా.. బాత్ రూమ్‌లు, టాయ్‌లెట్‌లు సక్రమంగా లేవు. చాలా బాత్‌రూమ్‌లకు డోర్లు కూడా లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇక కుక్ పోస్టు ఖాళీగా ఉండడంతో సహాయకులే వంట వండుతుండగా సమస్యలు ఎదురవుతున్నాయి. గత ఆదివారం మధ్యాహ్నం వండిన చికెనే సాయంత్రం వడ్డించగా.. సోమవారం ఉదయం సైతం ఉడికీ, ఉడకనీ కిచిడీ పెట్టడంతో విద్యార్థినులు కడుపు నొప్పి, వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించడంతో అంతా కోలుకున్నా భయంతో తల్లిదండ్రులు పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు. ఈ ఘటనలో వార్డెన్ విజయనిర్మల నిర్లక్ష్యం ఉందని తేలడంతో సస్పెండ్ చేశారు.


పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

అయితే, సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా పూర్తి కాలపు కుక్‌ను నియమించడంతో పాటు బాత్‌రూమ్‌లు, టాయ్‌లెట్లకు తలుపులు అమర్చాలని, డార్‌మెట్రీల్లో దోమలు రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

**డీఎంహెచ్‌ఓ పరిశీలన**

కల్లూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం డీఎంహెచ్‌ఓ కళావతిబాయితో పాటు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సీతారామ్, కల్లూరు వైద్యాధికారి నవ్యకాంత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాల, వంట తయారీకి ఉపయోగించే సామగ్రిని పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అలాగే, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

## ఆశ కార్యకర్తలతో ఇంటింటి సర్వే

ఖమ్మంవైద్యవిభాగం: రక్తపోటు, మధుమేహం బాధితుల చికిత్సపై ఆరా తీసేందుకు ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వేచేయాలని డీఎంహెచ్‌ఓకళావతిబాయి సూచించారు. ఎంపిక చేసిన ఆశా కార్యకర్తలకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంట్రల్ బృందం మూడు రోజులపాటు శిక్షణఇచ్చింది. ఈ బృందంలో డాక్టర్ డీ.ఆర్.స్వాతి, డాక్టర్ రోహిత్ గగ్రా ఉండగా డీఎంహెచ్‌ఓ బుధవారం వారితో సమావేశమై మాట్లాడారు. శిక్షణలో భాగంగా గురువారం నుండి ఒక్కో ఆశ కార్యకర్త, శిక్షణ పొందిన ఐసీఎంఆర్ సర్వేయర్లు సర్వే నిర్వహించాలని తెలిపారు. ఉదయం 6నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బాధితుల ఇళ్లకు వెళ్లి చికిత్స, వ్యాధి తీవ్రతపై ఆరా తీస్తూ సూచనలు చేయాలని చెప్పారు. ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు, ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, మురళి, నాగరాజు, చారి, మాలతి పాల్గొన్నారు.

**వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి**

తల్లాడ: గర్భిణులు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయించేలా వైద్య, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. తల్లాడ పీహెచ్‌సీలో బుధవారం వ్యాక్సినేషన్‌ను పరిశీలించిన ఆమె గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సహజ ప్రసవాలు ఎక్కువగా నమోదవుతున్నందున గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే, బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. కాగా, ఈనెల 11న నులిపురుగు నివారణ మాత్రలు పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ, వైద్యాధికారి ప్రత్యూషతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.


తల్లాడలో సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

### సైబర్ నేరగాళ్ల చేతిలో మోసం

ఖమ్మంఅర్బన్: ఖాతాలో నగదు నిల్వ పరిశీలించుకోవాలని సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌పై క్లిక్ చేయడంతో నగదు విత్‌డ్రా అయిన ఘటన ఇది. ఖమ్మం యూపీహెచ్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఈ.పుల్లయ్య ఫోన్‌కు బ్యాంకు బ్యాలెన్స్ చెక్ చేసుకోమంటూ మెసేజ్ వచ్చింది. దీనిపై క్లిక్ చేయగానే రూ.99,820 నగదు విత్‌డ్రా కావడంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లు గుర్తించాడు. ఆయన ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

### జ్వరంతో యువకుడు మృతి

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన పందిరి అప్పిరెడ్డి (24) వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ మృతి చెందాడు. ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేసే ఆయన నాలుగు రోజులుగా జ్వరం బాధపడుతుండగామంగళవారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు.

### చోరీ కేసులో మహిళ అరెస్ట్

తిరుమలాయపాలెం: బంగారం, వెండి నగల చోరీ కేసులో పోలీసులు ఓ మహిళను అరెస్టు చేశారు. తిరుమలాయపాలెంకు చెందిన పగిళ్ల రామకృష్ణ ఇంట్లో మే 23వ తేదీన దొంగతనం జరిగింది. రూ.లక్ష విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరించగా దర్యాప్తులో డోర్నకల్ మండలానికి చెందిన సాయికల్యాణిని నిందితురాలిగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేయడంతో పాటు కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

### దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- ఒకరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు


కె.చెన్నారావు (ఫైల్)

జూలూరుపాడు: కుటుంబీకులంతా దైవదర్శనం చేసుకున్నారు. బంధువులను కలిసి, మరో బంధువు నిశ్చితార్థంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. కానీ, వారి ప్రయాణం గమ్యం చేరుకోలేదు. వీరు వెళ్తున్న మారుతి వ్యాన్‌ను లారీఢీకొట్టడంతో ఒకరుమృతిచెందగా మరో ఐదుగురికిగాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా కొణి జర్ల మండలం గద్దలగూడెం గ్రామానికి చెందిన కె.చెన్నారావు (33) ఖమ్మంటౌన్–3 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు నుంచి బుధవారం తొమ్మిది మంది వ్యాన్‌లో ఖమ్మం వెళ్లగా చెన్నారావు డ్రైవింగ్ చేశాడు. ఖమ్మంలో దైవదర్శనం అనంతరం బంధువులను కలిసి చుంచుపల్లి బయలుదేరారు. హౌసింగ్ బోర్డులో బుధవారం సాయంత్రం చెన్నారావు మేనకోడలు నిశ్చితార్థానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం వద్ద వీరి వ్యాన్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చెన్నారావుకు తీవ్రగాయాలు కాగా సీపీఆర్ చేయడంతో పాటు తీవ్రంగా గాయపడిన ఆయన భార్య భార్గవి, తల్లిసావిత్రి, మరో ముగ్గురు క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే చెన్నారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగతా వారికి చికిత్స కొనసాగుతోంది.

- ఖమ్మంవ్యవసాయం: విద్యుత్‌శాఖ ఉద్యోగి ఆర్.చెన్నారావు(34) మృతిపై శాఖ ఉద్యోగులు సంతాపం తెలిపారు. జూలూరుపాడు సమీపాన జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందాడనే సమాచారంతో తెలియగా అధికారులు, ఉద్యోగులు నివాళులర్పించారు.

### ఇద్దరి మృతదేహాలకు అంత్యక్రియలు

ఖమ్మంఅర్బన్: వివిధ ప్రాంతాల్లో మృతిచెందిన ఇద్దరి మృతదేహాలకు అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యాన అంత్యక్రియలు నిర్వహించారు. వైరాకు చెందిన కార్తీక్ (40) ఇటీవల మృతిచెందగా ఆయన తల్లి వృద్ధురాలు కావడంతో పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావుకు సమాచారం ఇచ్చారు. దీంతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఖమ్మం బల్లేపల్లిలోని వైకుంఠధామానికి తీసుకొచ్చిఅంత్యక్రియలు పూర్తి చేశారు.అలాగే, మామిళ్లగూడెం వద్ద రైలు కిందపడి మృతి చెందిన గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహానికి కూడాపోలీసుల సూచనలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన అనుముల లచ్చిరెడ్డి(49) పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. పుట్టుకతో మరుగుజ్జుగా ఉన్న లచ్చిరెడ్డి వివాహం జరిగాక కొన్నాళ్లకు భార్య వెళ్లిపోయింది. అప్పటి నుండి అదే గ్రామంలోని సోదరి ఇంట్లో ఉంటూ పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి ఎవరూ లేని సమయాన పురుగుల మందు తాగగా, కాసేపటికి వచ్చిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. జీవితంపై విరక్తి, ఒంటరితనం భరించలేక ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు అందిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఖమ్మం రూరల్ సీఐ ముష్క రాజు తెలిపారు.

### కడుపునొప్పి తాళలేక..

రఘునాథపాలెం: కడుపునొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. మండలంలోని కొర్లబోడు తండాకు చెందిన గుగులోతు జ్యోతి(38) కొద్దిరోజులుగా కడుపు నొప్పితో బాధపడుతుండడంతో ఈనెల 1న ఎలుకల మందు తీసుకుంది. ఆమెకు ఖమ్మంలో చికిత్స అనంతరం హైదరాబాద్‌కి తరలించగా మృతి చెందింది. ఆమె సోదరుడు సతీష్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

### ఏడాది తర్వాత చోరీ సొత్తు రికవరీ

నిందితుల మధ్య విబేధాలతో వెలుగులోకి వ్యవహారం

వైరారూరల్: రిటైర్డు ఉద్యోగి ఇంట్లో టీవీని యువకులు చోరీ చేయగా.. వారి మధ్య విబేధాలతో ఏడాది తర్వాత వ్యవహారం బయటకొచ్చిన ఘటన ఇది. వైరా మండలం పూసలపాడుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి చెరుకుపల్లి ప్రసాద్ ఇంట్లో రూ.80వేల విలువైన ఎల్ఈడీ టీవీని కొందరు యువకులు గత ఏడాది ఆగస్టులో చోరీచేశారు. దీనిపై ప్రసాద్ అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఇటీవల నిందితుల మధ్య వివాదం తలెత్తడంతో చోరీ విషయాన్ని ప్రసాద్‌కు తెలిపారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్ఐ పవన్ టీవీని స్వాధీనం చేసుకుని విచారణ మొదలుపెట్టారు.

### స్పెషల్ డ్రైవ్‌లో 51 వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

తల్లాడ: తల్లాడలో బుధవారం పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 51 వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యాన తనిఖీ చేయగా, నంబర్ ప్లేట్ లేకపోవడంతో పాటు సరైన పత్రాలు లేని మోటార్ సైకిళ్లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, బీమా, రిజిస్ట్రేషన్ కలిగి ఉండడమే కాక నంబర్ ప్లేట్ అమర్చుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని తెలిపారు. తనిఖీల్లో ట్రెయినీ ఎస్ఐ వెంకటేశ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యుత్ మోటార్ల దొంగలు అరెస్ట్

కూసుమంచి: విద్యుత్ మోటార్లు, కాపర్‌వైర్ చోరీకి పాల్పడిన ముగ్గురిని కూసుమంచి పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి ఏడు మోటార్లు, కాపర్ వైరు, మూడు ద్విచక్ర వాహనాలు, టైర్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నాగరాజు తెలిపారు. కూసుమంచి శివాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మూడు బైక్‌లపై బస్తాలతో వెళ్తున్న వారు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. దీంతో వారిని పట్టుకుని విచారించగా కూసుమంచి మండలం వెంకట్రాంపురానికి చెందిన పుట్ట నరేష్, యాట రాజు, నిమ్మల రమేష్‌గా గుర్తించడంతో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. ఈశ్వరమాధారం, పాలేరులో చోరీలకు పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## నిబద్ధత గల నాయకుడిని కోల్పోయాం..

అయోధ్యకు సీపీఐ నేతల నివాళి


అయోధ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు బొల్లోజు అయోధ్య మరణంతో కమ్యూనిస్టు పార్టీ నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భద్రాద్రి జిల్లా సీపీఐ నాయకుడు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని ఖమ్మంలోని సీపీఐ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, పాకాలపాటి వెంకటేశ్వరరావు, జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కార్యదర్శులు దండి సురేష్, సాబీర్ పాషా తదితరులు అయోధ్య మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే ఎర్ర జెండా పట్టిన అయోధ్య తుదిశ్వాస వరకు అదే జెండా నీడలో పని చేశారని, ఆటుపోట్లను తట్టుకుని పేదలకు భూమి అందేలా చూశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, పాకాలపాటి లలితరాజేశ్వరి, యర్రా బాబు, మిరియాల రంగయ్య, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొనగా.. అయోధ్య మరణంపై మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు రఘురాంరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

## 'బీసీ రిజర్వేషన్ల పేరిట రాజకీయాలు'


మాట్లాడుతున్న కోటేశ్వరరావు, పక్కన నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పేరిట మత రాజకీయాలకు దారితీసే కుట్రకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేయడం గర్హనీయమని పేర్కొన్నారు. అక్కడ జరిగిన ధర్నా బీసీల హక్కుల కోసం కాకుండా, ముస్లింలకు రిజర్వేషన్ కల్పించే ప్రయత్నమేనని తెలిపారు. బీసీల హక్కులే కాంగ్రెస్ లక్ష్యమైతే ఇప్పటి వరకు ఒక్క బీసీ నేతను ముఖ్యమంత్రిగా ఎందు చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఏది ఏమైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడం ఖాయమని చెప్పారు. కాగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆధ్వర్యాన బీసీల సంక్షేమానికి అనేక పథకాలు అమలవుతున్నాయని కోటేశ్వరరావు తెలిపారు. నాయకులు ఈ.వీ.రమేష్, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, ఆల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాసరావు, పమ్మి అనిత, తడుపునూరి రవీందర్, రుద్రగాని మాధవ్, జ్యోతుల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

### నానో యూరియాతో లాభాల పంట


రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏఓ

ముదిగొండ: రైతులు సాధారణ యూరియా వాడకం తగ్గించి, నానో యూరియా ఉపయోగించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి దనసరి పుల్లయ్య సూచించారు. నానో యూరియా వినియోగంతో ఖర్చు, శ్రమ తగ్గడమే కాక పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ముదిగొండ మండలం పమ్మిలో పత్తి పంటలను బుధవారం పరిశీలించిన ఆయన నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. మధిర ఏడీఏ విజయచంద్ర, ఏఓ సరిత, ఏఈఓ లిఖిత పాల్గొన్నారు.

### నీటి సంపులో పడి బాలుడు మృతి


జయరిషినాయక్ (ఫైల్)

కామేపల్లి: ఆడుకునే క్రమాన ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిన రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. మండలంలోని పండితాపురానికి చెందిన బాదావత్ నాగరాజు–కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు జయరిషినాయక్(2) ఉన్నారు. ఈక్రమాన బుధవారం కవిత ఇద్దరు కుమార్తెలకు స్నానం చేయిస్తుండగా, జయరిషి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఆతర్వాత కుమార్తెలను ఇంట్లోకి తీసుకెళ్లిన క్రమంలో బాలుడు అక్కడే ఆడుతూ నీటి సంపులో పడిపోయాడు. కాసేపటికి రిషి కనిపించడం లేదని వెతుకుతుండగా సంపులో గుర్తించి బయటికి తీసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

### ఫోన్ మాట్లాడుతూ బావిలో పడి..

ఖమ్మంఅర్బన్: ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిన కార్మికుడు మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుధీర్ కుమార్(32) ఖమ్మం ఖానాపురంలోని గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆయన బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు సమీప బావిలో పడ్డాడు. సహచరులు బయటకు తీసేలోగా ప్రాణాలు కోల్పోవడంతో ఆయన బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ వెల్లడించారు.

### అసభ్య ప్రవర్తన కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్/వైరా: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వైరా మండలం గొల్లెనపాడుకు చెందిన 70ఏళ్ల చెరుకూరి లాలయ్యకు 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా పోక్సో–1 కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కె.ఉమాదేవి బుధవారం తీర్పుచెప్పారు. అంతేకాక ఆయనకు రూ.50వేల జరిమానా విధించారు. గత ఏడాది ఫిబ్రవరి 2న బాధిత బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా లాలయ్య తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయగా, విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా.. సిబ్బంది కె.చిరంజీవి, శ్రీకాంత్, ఆర్.నాగేశ్వరావు, చిట్టిబాబు సహకరించారు. కాగా, విచారణలో పాల్గొన్న సీఐ ఎస్.సాగర్, ఎస్సై పి.రామారావు, కానిస్టేబుల్ కె.చిరంజీవి సీపీ సునీల్‌దత్ అభినందించారు.


## సాక్షి క్లాసిఫైడ్స్

Services

జ్యోతిష్యాలయం

■ శ్రీ గురు రాఘవేంద్ర స్వామి అనుగ్రహ జ్యోతిష్య మందిరం, దైవజ్ఞ: వి. రాఘవన్ విద్య ఉద్యోగ కుటుంబ సమస్య, సతిపతి కలహం, ప్రేమ,పెళ్లి, సంతాన సమస్య, (స్త్రీ/పు) వశీక రణ, ప్రేమలో మోసపోవడం మీ ఎలాంటి గుప్త పరిష్కారం దొరకని నిగూఢ కష్టకర సమస్యలకు శాశ్వత పరిష్కారం సెల్ : 9676470724 [SCA25006899]

Wanted

■ స్వామి వివేకానంద గ్రూపు (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు 10th చదివిన వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9502501122, 9573691122 [B-1275599]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబీకేర్‌కై M/F వర్కర్స్ కా॥ భో+వ + జీతం 16–18 వేలు. ఏజెంట్లకు 5K కమీషన్. 9281465319/ 9515119570 [SCA25007009]

■ ప్రముఖ ఇన్సూరెన్స్ కంపెనీలో Leadersగా అవకాశం. మీరు ప్రస్తుతం చేస్తున్న జాబ్, బిజినెస్, ఇన్సూరెన్స్ అడ్వైజర్ అయినాకాని ఎటువంటి NOC అవసరం లేకుండానే జాయిన్ అవ్వవచ్చు. డిగ్రీ పాస్ అయిన స్త్రీ/పురుషులు 35 సం॥ల నుండి 70 సం॥ల లోపు. జీ: 25,000 + 8 రకాల Payouts+Local & ఇంటర్‌నేషనల్ ట్రిప్స్ + Flexible work టైం. ప్రొఫెషనల్ ట్రైనింగ్, సపోర్ట్. Note: Advisor recruitment చేయగలిగే వారికి మాత్రమే ఇంపార్టెన్స్: Ph: 95509 51761, 77806 62996 [SCA 25007019]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957
9705444182
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.